# దృష్టిభేదం



జొన్నలగడ్డ రాజగోపాలరావు

భగవంతుడు అందరికీ దృష్టిని ప్రసాదించి నప్పటికీ— అందరినీ ఒకేలా చూడగల శక్తి ప్రసాదించ లేదని పిస్తుంది— కొంత మందిని చూస్తుంటే.

రాజా కమలకు ఏదో దూరపు వరుసలో బంధు వవుతాడు. నా అనే వాళ్ళులేని రాజును తనవద్ద ఉంచుకుందామని కమల అనుకుందంటే మాత్రం కారణం అదికాదు. ఆమెది స్వతహాగా జాలిగుండె. పైగా భర్త తనమాట కాదనడనే ధైర్యంకూడా ఆమె కుంది.

శంకర్రావు భార్యమాట కెదురాడలేని మాట నిజమే కానీ, వ్యక్తిత్వం లేనివాడు మాత్రం కాదు. అతని అభిప్రాయాలు అతనికీ ఉన్నాయి. మొదటి చూపులోనే రాజా అతని కళ్ళకు నచ్చలేదు. అందుకే అతను కమలకు నచ్చజెప్పాలని ప్రయత్నించాడు కూడా.

కానీ కమల మొండి పట్టు పట్టింది. భర్త కళ్ళకు "దొంగ వెధవ"లా కనిపించిన రాజా ఆమె కళ్ళకు అమాయకుడిలా కనిపించాడు. తన మావయ్య గారింట్లో రాజును కష్టపెడుతున్నారనీ— తమ దగ్గిరయితే బాగా చూడొచ్చుననీ— ఇవన్నీకాక కొడుకు సుబ్బారావుకి తోడుగా ఉంటాడనీ ఆమె వాదించింది.

ఎవరో, ఎవరో పిల్లాడిని బాధలు పెడుతూంటే అవి తీర్చవలసిన బాధ్యత తనకు ఉందంటే శంకర్రావు సుతరామూ ఒప్పుకోడు. పదేళ్ళ సుబ్బారావుకి తోడుకావలసిన అవసరం ఉందన్నా అతను ఒప్పుకోడు. కానీ భార్య మాటల కతను అంగీకరించాడంటే రెండే రెండు కారణాలున్నాయి. ఓ అనాథ బాలకుణ్ణి యావజ్జీవితమూ పోషించగల ఆర్థికస్తోమతు తన కుండడం మొదటిది, అటు వంటప్పుడు భార్య మనసు కష్టపెట్టడ మెందు కనేది రెండవది.

ఆనాటినుంచీ రాజాకు శంకర్రావింట్లో స్థానం లభించింది. కానీ ఈ విషయంలో శంకర్రావు ఒక షరతుపెట్టాడు. ఎప్పుడైనా రాజా కనుక దొంగతనంలాంటి వెధవ పనులు చేశాడంటే తక్షణం ఇంట్లోంచి పంపించేయాలని. ఈ షరతుకు కమల కూడా ఒప్పుకుంది. అతను షరతు పెట్టడానికి అతనికి రాజామీదున్న దురభిప్రాయం కారణమయితే, ఆమె షరతు అంగీకరించడానికి ఆమెకు రాజామీదున్న సదభిప్రాయం కారణమయింది.

కమల రాజును కొడుకుతో సమానంగా చూసుకునేది. ఆమె ప్రోద్బలంమీదనే శంకర్రావు రాజుని సుబ్బారావు చదువుతూన్న స్కూల్లోనే ఫస్టు ఫారంలో జేర్పించాడు. అప్పుడు సుబ్బారావు సెకండ్ ఫారంలో ఉన్నాడు.

శంకర్రావు సరైన చనువు ఇవ్వకపోవడం వల్ల— అతను కన్పించినప్పుడల్లా— రాజా బెదురు చూపులు చూస్తుండేవాడు. ఆ చూపులు చూస్తే శంకర్రావు కేవేవో అనుమానాలు కలుగుతుండేవి. కానీ రాజామాత్రం కమలను అమ్మా అని పిలిచేవాడు.

తలిదండ్రుల విషయమెలా ఉన్నా— సుబ్బారావుకి మాత్రం మొదట్లో రాజాతో మంచి దోస్తీ కుదిరింది. ఇద్దరిదీ ఒకే వయసయినప్పటికీ, రాజా

కంటే తను ఒకక్లాసు ఎక్కువే అయినప్పటికీ— సుబ్బారావుకి రాజుకున్న అనుభవం లేదు. రాజు ఆరేడేళ్ళుగా పరాయిచోట కష్టాల్లో మసిలాడు. అందువల్ల అతనికి ప్రపంచమంటే ఏమిటో సుబ్బారావుకంటే ఎక్కువ తెలుసును.

అసలు సమస్యలనేవి ఏమిటో సుబ్బారావుకి తెలియవు. తనకు కావలసినవన్నీ తల్లీ, తండ్రీ ఇస్తారు. అందువల్ల రాజు తన కొకప్పు డెదురైన సమస్యలను గురించి వివరిస్తుంటే అతను ఆశ్చర్యంగా వినేవాడు.

అయితే సమస్యలను సృష్టించుకోడం పెద్ద కష్టమైన విషయమేమీ కాదు. సమస్యల గురించి రాజు చెబుతూంటే ఆశ్చర్యంగా వినే సుబ్బారావు కిప్పుడు సమస్య లెదురయ్యాయి. అందుకు కారణం గోపీతో స్నేహం.!

గోపీకి పదేళ్ళుంటాయి. అయినా అతనికి వయసుకి మించిన ఆలోచనలు. డబ్బున్న వాళ్ళ అబ్బాయే కానీ మనిషికి దురలవాట్లున్నాయి. అతను ఎక్కువగా ఆడవాళ్ళ గురించీ, సినిమాల గురించీ మాట్లాడుతూంటాడు.

గోపీతో స్నేహం కుదిరినప్పట్నుంచీ సుబ్బారావుకి రాజు మాటలమీద ఉత్సాహం తగ్గిపోయింది. గోపీ కబుర్లు చెబుతూంటే అతనికి ఒకరకమైన ఆవేశం కలిగి— ఆనందంగా ఉండేది.

ఓరోజు గోపీ సుబ్బారావుని పిలిచి సినిమాల గురించి చిన్న ఉపన్యాసం దంచాడు. సినిమాలు చూడని జీవితం వ్యర్థమని ఓసారి నిట్టూర్చాడు. తరువాత వూళ్ళో ఆడుతూన్న ఓ ఇంగ్లీషు సినిమాలోని రెండు మూడు సన్నివేశాల్ని చెప్పి సుబ్బారావుని రెచ్చగొట్టాడు. తరువాత ఒక్క నిముషం ఆగి— "ఆ సినిమాకు వెడదామా?" అన్నాడు.

గోపీ చెప్పినదంతా వినేసరికి సుబ్బారావుకీ ఆ సినిమా చూడాలనే అనిపించింది. కానీ అతను ఒక్క నిముషం ఆలోచించి— "ఈ రోజు బడి ఉందిగదా— సెలవురోజు వెడదాం!" అన్నాడు.

"సెలవు రోజు దాకా ఇంగ్లీషు సినిమాలు కూర్చుంటాయనుకుంటున్నావేమిటి? భలేవాడివే — మధ్యాహ్నం బడి మానేసి......"

ఉలిక్కిపడ్డాడు. "అమ్మ బాబోయ్— బడి మానేయడమే— అయినా నా దగ్గర డబ్బులు లేవు బాబూ!"

గోపీ గర్వంగా నవ్వుతూ జేబులోంచి ఐదు రూపాయల నోటు తీశాడు. సుబ్బారావు ఆ నోటు వంకే ఆశ్చర్యంగా చూసి— "అయిదు రూపాయలే — మీ నాన్నగా రేకంగా నీకన్ని డబ్బు లిస్తారేంటీ!" అన్నాడు.

"భలేవాడివే— నాన్నెప్పుడూ అసలు డబ్బే ఇవ్వరు. ఇది నేను పేకాడి గెల్చుకున్న డబ్బు!"

గోపీ అలాచెబుతూంటే సుబ్బారావు కళ్ళు చక్రాల్లా తిరిగాయి. "అయితే పేకాడితే డబ్బులొస్తాయా?"

"ఆ. బోలెడు డబ్బు సంపాదించవచ్చు. నా ఖర్చులకి డబ్బెక్కణ్ణించి ఎస్తోందను కున్నావు? హీనీ— నువ్వూ పేకాడరాదూ?"

సుబ్బారావు ఆలోచనలో పడ్డాడు. నిజంగానే గోపీ డబ్బు ఎక్కువగా ఖర్చుపెడతాడు. అప్పుడప్పుడూ తనకూ అలా ఖర్చుపెట్టాలనిపిస్తుంటుంది. కాని అన్ని డబ్బులు నాన్నగా రివ్వరు, మరి పేకాడితే......

గోపీ మళ్ళీ అన్నాడు. "ముందు ఓ రెండ్రూపాయలు పట్టుకురా. అక్కణ్ణించి ఇంక అంతానీదే డబ్బు. అది వ్యాపారానికి పెట్టుబడి లాంటి దన్నమాట— మరి మధ్యాహ్నం సినిమాకు వెడదామా?"

"కానీ— మరి నాన్నగారికి చెప్పలేదే?" నసిగాడు సుబ్బారావు.

గోపీ గట్టిగా నవ్వేసి— "ఇంత అమాయకుడివేమిట్రా— అన్ని సినిమాలు నాన్నగారితో చెప్పి వెడితే ఎలా? అందులో బడి ఎగ్గొట్టి సినిమాకు వెడుతున్నామంటే నాన్నగారికి అసలు చెప్పకూడదన్నమాట!" అన్నాడు.

సుబ్బారావు చాలా కంగారు పడ్డాడు. "నాకు ఏదో భయంగా ఉందిరా గోపీ!" అన్నాడు.

"మొదట్లో అలానే ఉంటుంది. తరువాత భలే సరదాగా ఉంటుందిలే"— అన్నాడ గోపీ.

మధ్యాహ్నం ఇంటర్వెల్ సమయంలో భోజనాల దగ్గర అన్నాడు సుబ్బారావు రాజుతో— "నేను ఈ రోజు ఇంటికి కొంచెం ఆలశ్యంగా వస్తాను. స్కూల్లో ఏదో మీటింగుందని చెప్పు అమ్మతో!"

"నువ్వెక్కడి కెడుతున్నావు?" అడిగాడు రాజు.

"అదంతా తరువాత చెబుతాన్లే— అమ్మతో మాత్రం నువ్విలాచెప్పు!" సంభాషణ అంతటితో ఆగిపోయింది.

సాయంత్రం రాజు ఒక్కడే రావడం చూసి అడిగింది కమల— "వాడేడిరా— నువ్వొక్కడివే వచ్చావ్!"

"బళ్ళో ఏదో మీటింగుంది. నాకు వినాలని లేక వచ్చేశాను. వాడక్కడున్నాడు. వచ్చేసరికి కొంచెం ఆలశ్యమవుతుంది"— అన్నాడు రాజు.

"వెర్రినాయన, ఎటువంటి సరదాలూ లేవు. వాడి చదువేమిటో వాడి పనేమిటో తప్ప—" అనుకుంది కమల. "వెధవికి— ఎప్పుడింటికొచ్చేద్దామా అని దృష్టి— లేకపోతే మీటింగుకి వెళ్ళకపోవడ మేమిటి?" అనుకున్నాడు శంకర్రావు.....

మర్నాడు ఉదయం శంకర్రావు— జేబులో రెండు రూపాయలు తక్కువచ్చాయని కారాలూ మిరియాలూ నూరసాగాడు. "స్నానానికి వెళ్ళే ముందే లెక్కెట్టుకున్నాను. వచ్చేసరికి రెండు రూపాయలు తగ్గిపోయాయి. ఇలాగయితే ఈ కొంపలో ఎలా? ఇదివర కెప్పుడూ ఇలాంటివి జరగలేదు!"

"బాగుందండీ వరస— డబ్బులు తీయడానికి ఈ యింట్లో ఎవరున్నారని— ఆ కుర్రవెధవలూ, నేనూ తప్పితే! అసలు మీకు మతిమరుపు ఎక్కువ. తప్పులెక్కెట్టుకున్నారో యేమో!" అంది కమల.

"నేను తప్పు లెక్కపెట్టడమా! బాగుంది వరస— నువ్విలా సమర్థించడం మొదలెడితే ఆ దొంగవెధవలకి ప్రోత్సాహం ఎక్కువైపోతుంది. ఒక్కసారి ఈ కుర్ర వెధవల లాగు జేబుల్లో చూస్తే సరి— తెలిసిపోతుంది!"

అతనీ మాట లనేటప్పుడు రాజును దృష్టిలో ఉంచుకునే అంటున్నాడని కమల గ్రహించి కొద్దిగా బాధపడింది. ఇంక ఏమన్నా శంకర్రావు రెచ్చిపోతాడని— మాట్లాడకుండా వూరుకుంది.

శంకర్రావు ముందు రాజును లాగుజేబులు చూపించమన్నాడు. రాజు చూపించాడు. వాటిల్లో ఏమీలేదు. ఇంక అతను సుబ్బారావు జేబులు చూపించమని అడగలేదు. "అయినా దొంగవెధవలు— లాగుజేబుల్లో ఎందుకు దాస్తారూ?" అంటూ గొణుక్కున్నాడు నెమ్మదిగా.

సుబ్బారావుని జేబులు చూపించమని అడక్కపోవడమూ, తన నొక్కడినే అడగడమూ రాజుకి చాలా బాధ కలిగించింది. శంకర్రావు తననే అనుమానించారని ఆ పసి హృదయం గ్రహించింది. అయితే అతని బాధను కమల అర్థం చేసుకోగలిగింది. అందుకే భోజనాల సమయంలో అతన్ని నెమ్మదిగా లాలించింది.

"చూడుబాబు— పెద్ద వాళ్ళకి బోలెడు గొడవ లుంటాయి. అందువల్ల వాళ్ళు అప్పుడప్పుడు చిరాకు పడుతూంటారు. దాన్ని మనం ఇంకోలా అర్థం చేసుకుని కోపగించుకో కూడదు. నీకిష్టమని బంగాళాదుంపల వేపుడు చేశానా? మరి బొత్తిగా అంత తక్కువ అన్నం పెట్టించుకుంటే ఎలా? ఈ కెరడు కూడా వెయ్యనీయి......"

ఆమె లాలనలో రాజుకి నిజంగా ఏడుపు వచ్చేసింది. ఒక్క నిముషంసేపు ఏడ్చేశాడు. కన్నీళ్ళతో పాటే అతని విచారం కూడా తగ్గిపోయింది. భోంచేస్తున్నంతసేపూ— కమల రాజువంకే జాలిగా చూసింది. నా అన్నవాళ్ళు లేని ఆ పిల్లవాడు ఆమె హృదయంలో అప్పుడే కొడుకుకంటే ముఖ్యమైన స్థానం సంపాదించుకున్నాడు.

భోజనాలవగానే క్యారేజీపట్టుకుని రాజూ, సుబ్బారావూ బడికి బయల్దేరారు. దోవలో రాజు సుబ్బారావుని అడిగాడు. "నువ్వేకదూ— నాన్న జేబులో డబ్బు తీసింది"—

సుబ్బారావుకి తడబాటుతోపాటు కోపంకూడా వచ్చింది. "ఒరేయ్— ఏం మాట్లాడుతున్నావో తెలిసే అంటున్నావా?"

"కోపగించుకోకురా— నువ్వు చాలా మంచి వాడవని నాకు తెలుసు. కానీ ఆగోపీ ఉన్నాడే— వాడొట్టి దొంగవెధవ. వాడి స్నేహం వల్లనే నీకు చెడు అలవాట్లు వస్తున్నాయి. నిన్న మీరిద్దరూ బడి మానేసి సినిమాకు వెళ్ళారు. ఈ వేళేమో పేకాడ్డానికని ఇంట్లో దొంగిలించి రెండు రూపాయలు తెమ్మన్నాడు. అవునా?" అడిగాడు రాజు.

సుబ్బారావు రాజు వంక ఆశ్చర్యంగా చూశాడు. "నిజమేగానీ ఇవన్నీ నీకెలా తెలిశాయిరా!"

"ఎలాగో తెలిశాయి కానీ నా మాట విని ఆ గోపీ చెప్పినట్టు చెయ్యకు. దొంగతనం పాపం. పాపం చేస్తే మనం చచ్చిపోయాక నరకలోకంలో మన వీపు మీద వాతలు పెడతారుట. మనని కాగుతున్న నూనెలో వేయించేస్తారుట. అందుకే, పాపం చెయ్యకూడదు. బడి మానేసి సినిమా చూడడమూ, పేకాడడమూ, దొంగతన్నం చేయడమూ— ఇవన్నీ కూడా పాపాలే!"

"నిజంగా!" సుబ్బారావు చాలా భయపడ్డాడు. అప్పుడతనికి నరకలోకంలోని శిక్షలతోపాటు భూలోకంలోని శిక్షలు కూడా గుర్తుకొచ్చాయి. "అయితే ఇంకెప్పుడూ ఏ పాపమూ చెయ్యను. నువ్వు మాత్రం ఈ విషయాలేవీ నాన్నగారికి చెప్పకేం!"

"ఛఛ! నేనెందుకు చెబుతాను. మన మిద్దరం అన్నదమ్ములం కదూ!"

"నువ్వు చాలామంచి వాడవురా రాజూ!"

# ఆంధ్రసచిత్రవారపత్రిక

# నవలల పోటీ!

## మొదటి బహుమతి రు.3,500

## రెండవ బహుమతి రు.1,500

## మూడవ బహుమతి రు.1,000

ఆంధ్రసచిత్ర వారపత్రిక పాఠకులకి మరింత మంచి సీరియల్ నవలలని అందచెయ్యాలనే ఉద్దేశంతో పై పోటీని నిర్వహిస్తున్నాము. రచయిత(త్రు)లందరూ ఎప్పటివలె మాతో సహకరించి పై పోటీ జయప్రదం చెయ్యగలరని ఆశిస్తున్నాము.

## ముగింపు తేదీ: 31-1-1967

**రచయితల కోరికపై గడువుతేదీ పొడిగిస్తున్నాము**

## నిబంధనలు

1. పోటీకి స్వంతరచనలే పంపాలి. పంపే రచనలు తమ స్వంతమయినవే ననీ, అనువాదాలుకాని, అనుసరణలుకాని కాదని రచయిత(త్రు)లు వ్రాతప్రతితో బాటు హామీ పత్రాలు పంపాలి.

2. రచనలు కాగితానికి ఒకవైపునే, సిరాతో రాసిఉండాలి. 100అరఠావు (ఎక్సర్సయిజు పుస్తకం పేజికి రెండురెట్లు) పేజీలు లోపు,300 అరఠావు పేజీలు మించి ఉండరాదు.

3. నవలలు తెలుగువారి జీవితానికి సంబంధించి ఉండాలి.

4. వ్రాతప్రతులు 31—1—1967 లోపల మా కార్యాలయం చేరాలి.

5. వ్రాతప్రతులు, 'సంపాదకుడు ఆంధ్రసచిత్ర వారపత్రిక, తంబుచెట్టివీధి, మద్రాసు—1' కి పంపాలి.

6. కవరుమీద, వ్రాతప్రతిమీద 'నవలల పోటీ— 1966' అని స్పష్టంగా రాయాలి.

7. పోటీలో నెగ్గని నవలలు ఆంధ్రసచిత్ర వారపత్రికలో ప్రచురించే హక్కు మాకు ఉంది.

8. పోటీలో నెగ్గని, ప్రచురణకి స్వీకరింపబడని నవల వ్రాతప్రతులని వీలయినంత త్వరలో, సురక్షితంగా రచయిత(త్రు)లకి తిప్పిపంపే ప్రయత్నాలు చేస్తాము కాని ఈ విషయంలో ఎటువంటి బాధ్యతనీ వహించలేము, హామీ ఇవ్వలేము. వ్రాతప్రతులతోబాటు తగుమాత్రం తపాలాబిళ్లలు అతికించిన, స్వంత చిరునామా కల కవర్లు జతపరచటం అనవసరం.

9. పోటీలో తుదినిర్ణయం సంపాదకునిదే. ఈవిషయములో ఎటువంటి ఉత్తరప్రత్యుత్తరాలూ జరుపబడవు.

10. ఆంధ్రసచిత్ర వారపత్రికలో ప్రచురణ పూర్తిఅయిన తర్వాత పుస్తకరూపంలో నవలని వెలువరించగోరేవారు పుస్తకంలో ప్రముఖంగా 'ఆంధ్రసచిత్ర వారపత్రికనుంచి పునర్ముద్రితం' అని పేర్కొనాలి.

## దృష్టిభేదం

స్కూలు రాగానే ఇద్దరూ విడిపోయారు. క్లాసులో సుబ్బారావుని గోపీ పలకరించాడు కానీ సుబ్బారావు ముభావంగా ఉన్నాడు. గోపీ కేదో అనుమానం వచ్చింది. "ఏరా డబ్బు దొరకలేదా?"

"దొరికిందికానీ నేనిక నీతో మాట్లాడను. పేకాడ్డమూ, అవన్నీ పాపాలుగా! అవి చేస్తే నరకానికి పోతారుటగా."

గోపీ నవ్వేసి—"ఎవరురా చెప్పింది?" అన్నాడు.

"ఎవరయితే యేంలే నిజమవునా కాదా?"

"కాదు కాబట్టే నవ్వుతున్నాను."

సుబ్బారావు ఆశగా తలెత్తాడు. అతనికి ఈ పాపాలని చెప్పబడే వాటి మీద ఆసక్తి పెరుగుతోంది. అవి పాపాలు కాదని ఎవరైనా చెబితే నమ్మాలని కూడా అతనికి ఉంది. అందుకే గోపీ మాటలు అతనిలో ఆసక్తిని కలిగించాయి. "మరయితే డబ్బులు పోయాయని తెలియగానే మా నాన్నకు అంత కోపమొచ్చిందేం?" అన్నాడు గోపీ ఏదో చెప్పబోతుండగా క్లాసులోకి మేష్టారు అడుగెట్టారు. అప్పటికి ఆ సంభాషణ ఆగింది.

ఒక విషయంలోని మంచిచెడ్డలను మనం అర్థం చేసుకోవడం—మనకు ఆ విషయం మీద ఉన్న ఆసక్తి మీద ఆధారపడి ఉంటుంది. గోపీ సుబ్బారావుని తన మార్గం వైపు మళ్ళించగలిగాడంటే అది అతని గొప్పతనంకాదు, సుబ్బారావుకు ఆ మార్గం మీదున్న ఆసక్తి!

మధ్యాహ్నం భోజనాల దగ్గర సుబ్బారావుతో అన్నాడు. "ఈ వేళ కూడా ఏదో మీటింగుందని అమ్మతో చెప్పాలి. కానీ అమ్మ నమ్మదేమో—కాబట్టి నువ్వు కూడా ఇంటికి కొంచెం ఆలశ్యంగా వెళ్ళాలి!"

రాజు సుబ్బారావు కేసి అదోలా చూశాడు. "పేకాడుతున్నావా అయితే!"

"లేదురా అందుక్కాదు. వూరికే సరదాగా, బడి ఐపోయాక, అలా తిరిగొచ్చేస్తాం. అంతే!" అన్నాడు సుబ్బారావు.

"అయితే మీటింగని అబద్ధం ఆడడమెందుకు? స్నేహితులతో షికారు వెళ్ళారని అమ్మతో చెబుతాను. ఏమీ అనదులే!" అన్నాడు రాజు. సుబ్బారావు కూడా అందుకు ఒప్పుకున్నాడు.

ఇలా మరో నాలుగురోజులు గడిచాయి. సుబ్బారావు మారిపోతున్నాడనీ ఈ విషయం కమలకు తెలియబర్చకపోతే ప్రమాదమేమోనని రాజుకి అనిపించసాగింది. కానీ అతను తొందరపడి ఏ విషయమూ తేల్చుకోలేకపోతున్నాడు. ఒకవేళ తను చెప్పినవి వాళ్ళు నమ్మకపోతే ఎంత అసహ్యంగా ఉంటుంది? గిట్టక వాడిలా చెప్పినట్లుండదూ?

దొంగతనం పాపమని తను సుబ్బారావుకి చెప్పిన నీతులు ఏ విధంగానూ పని చేసినట్లు లేదు. ఆ రోజు మళ్ళీ సుబ్బారావు శంకర్రావు జేబులోంచి కొంత డబ్బు తీయడం చూశాడు రాజు. అతని మనస్సు పరిపరివిధాలపోయింది.

కొద్దిసేపట్లో శంకర్రావు డబ్బు పోయిందని గ్రహిస్తాడు. మళ్ళీ రభస జరుగుతుంది. తను సుబ్బారావుని పట్టిద్దామన్నా శంకర్రావు నమ్మడు. తనే తెచ్చి వాడి పుస్తకాల్లో పెట్టాననవచ్చు. ఈ అనుభవం అతను పూర్వాశ్రమంలో పొందనే పొందాడు.

